

పురస్కారాలను ప్రదానం చేస్తున్న అతిథులు

మానస ఉగాది ప్రతిభా పురస్కారాలు ప్రదానం

చిక్కడపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): సాంస్కృతిక సంస్థ మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు విశ్వావసు నామ ఉగాది పురస్కారాలు ప్రదానం చేశారు. గురువారం త్యాగరాయగానసభలో ప్రముఖ ఆధ్యాత్మికవేత బండారు రామచంద్రరావు అధ్యక్షతన పురస్కారాల ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ప్రముఖ కవి వీవీ చందర్‌రావు పాల్గొని మాట్లాడారు. మానస సంస్థ నిర్వాహకులు కవి రఘుశ్రీ తోటి రచయితల ప్రతిభను గుర్తించి గౌరవించడం సంస్కారవంతంగా ఉందన్నారు. రఘుశ్రీ పర్యవేక్షణలో ఎస్ఆర్ఎస్ఎల్ఎన్ మూర్తి, డా. సాంబమూర్తి, శ్రీలక్ష్మి, డా. ఐశ్వర్య, డా. సీతాలక్ష్మి, వెంకటేశ్వర్లు, రాజేంద్రకుమార్, నవకాంత్ పురస్కారాలు అందుకున్నారు. మొదట అంజలి, కె.అక్షర ఆలపించిన భక్తిగీతాలు ఆకట్టుకున్నాయి.



పురస్కారగ్రహీతలతో అతిథులు

పిల్లల్లో సృజనాత్మక శక్తిని ప్రోత్సహించాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో సృజనాత్మకశక్తిని ప్రోత్సహించాలని వక్తలు పేర్కొన్నారు. గురువారం రాత్రి త్యాగరాయగానసభలో రసమయి సంస్థ ఆధ్వర్యంలో కవి డా. ఎంకె.రాము పర్యవేక్షణలో సృజనాత్మక కళల్లో ప్రతిభావంతులైన బాలలకు ఉగాది పురస్కారాల ప్రదాన సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఇన్‌కంటాక్స్ మాజీ చీఫ్ కమిషనర్ నరసింహప్ప పాల్గొని పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో రాజగోపాల్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యూఎస్‌లో ఉగాది వేడుకలకు మాళవిక



చిక్కడపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): తెలుగు ఫైన్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 12న యూఎస్ న్యూజెర్సీలో ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మధు తెలిపారు. ఈ వేడుకల్లో పాల్గొనడానికి చిక్కడపల్లి ప్రాంతానికి చెందిన ప్రముఖ క్లాసికల్ సింగర్ మాళవిక ఆనంద్ ఆహ్వానాన్ని అందుకున్నారు. ఈ నెల 9వ తేదీన అమెరికా వెళ్తున్నట్లు గురువారం ఆమె తెలిపారు. మన తెలుగు సంస్కృతి సంప్రదాయాలను ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పనున్నట్లు మాళవిక ఆనంద్ తెలిపారు.



పురస్కారాలను ప్రదానం చేస్తున్న మధుసూదనాచారి, జనార్దనమూర్తి

గానసభ అభివృద్ధికి కళా కుటుంబం అంకితం

చిక్కడపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): త్యాగరాయగానసభ అభివృద్ధిలో కళా కుటుంబం అంకితమైందని ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి అన్నారు. గానసభ ఆధ్వర్యంలో గానసభ పూర్వ అధ్యక్షులు కళా దీక్షితులు జయంతి గురువారం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మధుసూదనాచారి హాజరై కళాదీక్షితులు స్మారక పురస్కారాలను సాంస్కృతికరంగ ప్రముఖులు సతీష్‌బాబు చౌదరికి, సీహెచ్‌వీ ప్రసాద్‌కు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళా సుబ్బారావు తనయుడు దీక్షితులు గానసభ అధ్యక్షుడిగా ఆడిటోరియంను సుందరంగా తీర్చిదిద్దేందుకు శ్రీకారం చుట్టారన్నారు. ఆయన సోదరునిగా కళా జనార్దనమూర్తి అధ్యక్ష స్థానంలో కొనసాగుతున్నారని అభినందించారు. అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు జనార్దనమూర్తి మాట్లాడుతూ తన సోదరుడు దీక్షితులు అర్థాంతరంగా జీవితాన్ని ముగించడంవల్ల తాను ఏకగ్రీవంగా అధ్యక్షుడిగా ఎంపిక అయ్యానని, తండ్రి, సోదరుడు వేసిన బాటలో గానసభ అభివృద్ధికి కృషి చేస్తున్నానన్నారు. గానసభ సంయుక్త కార్యదర్శి చక్రపాణి, పాలకవర్గ సభ్యురాలు గీతదేవి, యువకళావాహిని అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. జొన్నలగడ్డ జగన్‌మోహన్‌రావు ఆధ్వర్యంలో ఆయన కృష్ణునిగా నటించిన కృష్ణరాయబారంలోని శయన దృశ్యం ప్రదర్శించారు.



కవాడిగూడ చిత్రాల నర్సింహులు ప్రభుత్వ పాఠశాల వద్ద బీఆర్ఎస్ నేత తడకపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న బీఆర్ఎస్ గ్రేటర్ సీనియర్ నాయకులు ఎంఎన్ శ్రీనివాస్ రావు తదితరులు
- కవాడిగూడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి)

హోంశాఖ వైఫల్యం వల్లే
విదేశీ మహిళపై అత్యాచారం: శ్రీనివాస్ రావు

ముషీరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హోంశాఖ వైఫల్యం వల్లే నగరంలో విదేశీ మహిళపై అత్యాచారం జరిగిందని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్ రావు ఆరోపించారు. నగరంలో హత్యలు, అత్యాచారాలు జరుగుతుంటే ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందని ఆరోపించారు. గాంధీనగర్‌లోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత జిల్లాలో మరో మహిళలపై అత్యాచారం జరగడం దారుణమని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి పరిపాలనపై పట్టు లేదని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 400 ఎకరాల స్థలాన్ని అమ్మే నిర్ణయాన్ని విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు.

టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌కు సన్మానం



బీసీ బిల్లుపై ఢిల్లీలో ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేసిన టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే శ్రీరామ భద్రయ్య, లేబర్ బోర్డ్ మాజీ వైస్‌చైర్మన్ నాగభూషణం, కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధానకార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్, నాయకులు రామ్‌మోహన్‌రావు, గడ్డం శ్రీధర్‌గౌడ్ తదితర నాయకులు పాల్గొన్నారు.
- రాంనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి)



మోహన్‌నగర్‌లో కారుపై విరిగిపడ్డ చెట్ల కొమ్మలు



బాపూజీ నగర్‌లో రోడ్డుపై ఏరులై పారుతున్న వర్షపు నీరు



రంగానగర్‌లో భారీ వర్షానికి ఊడిపడ్డ ఇంటి పైకప్పు పెచ్చులు



బాపూజీనగర్‌లో కూలిన స్లాబ్‌ను పరిశీలిస్తున్న బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కుమార్



భారీ వర్షానికి చెరువును తలపిస్తున్న ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణం

భారీ వర్షం

- ముషీరాబాద్‌లో కాలనీలు జలమయం
- రోడ్లపై చేరిన మోకాళ్లలోతు వరద నీరు
- ఇబ్బంది పడ్డ వాహనదారులు, పాదచారులు

ముషీరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్‌లో గురువారం కురిసిన భారీ వర్షానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముషీరాబాద్ డివిజన్‌లోని బాపూజీనగర్, ప్రేయర్‌పవర్ చర్చివీధి, బాప్టిస్ట్ చర్చి వీధి, పార్శిగుట్ట చౌరస్తా, రాజాడీలక్స్ చౌరస్తా వద్ద వరద నీరు రోడ్లపై మోకాళ్లలోతు ప్రవహించింది. బాపూజీనగర్, ప్రేయర్‌పవర్ చర్చి వీధిలో ఇళ్లలోకి వదర నీరు చేరింది. భోలక్‌పూర్ రంగానగర్‌లోని ఓ భవనం మూడో అంతస్తు పై కప్పు పెచ్చులు ఊడి పడ్డాయి. ఈ ఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. బాపూజీనగర్‌లో పురాతన భవనం గోడలు, స్లాబ్ కూలిపోవడంతో బీజేపీ ముషీరాబాద్ నియోజకవర్గం జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, బీజేవైఎం నగర కార్యదర్శి అనిల్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్ ఘటనా స్థలానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో భారీగా వర్షపు నీరు నిలిచిపోయి చెరువును తలపిస్తోంది.



గాంధీనగర్‌లో వరద నీటిలో పాదచారుల అవస్థలు

కవాడిగూడలో..

కవాడిగూడ, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ కల్పనా థియేటర్, భాగ్యలక్ష్మీనగర్, చిత్రాల నగర్, పద్మశాలీ కాలనీ రోడ్, కెనరాబ్యాంకు, గాంధీనగర్ బ్రిడ్జ్ పరిసరప్రాంతాలలో వర్షపు నీరు మోకాలు లోతు ప్రవహించడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. గాంధీనగర్ బ్రిడ్జి, ఎన్‌టీఆర్ స్టేడియం వద్ద భారీగా రోడ్లపై నిలిచిన వరద నీరు సాఫీగా వెళ్లేలా జీహెచ్ఎంసీ సిబ్బంది చర్యలు తీసుకున్నారు.

అరుంధినగర్ బస్తీలోకి..

చిక్కడపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): గురువారం కురిసిన వర్షానికి గాంధీనగర్ డివిజన్ అరుంధతినగర్ బస్తీలో మోకాలిలోతు నీరు చేరింది. వరదనీరు బస్తీలోకి రావడంతో ఇళ్లలోని వారు బయటకు రావడానికి ఇబ్బందులు పడ్డారు. హుస్సేన్‌సాగర్ కాలువలోకి వరదనీరు వెళ్లకపోవడంతో బస్తీలోనే నీరు నిలిచిపోయింది. దీంతో మోకాలిలోతు నీరు చేరి దాదాపు నాలుగు గంటలపాటు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇకనైనా తమ బస్తీని పట్టించుకోవాలని బస్తీ అధ్యక్షుడు శ్రీనివాస్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు.



పద్మశాలికాలనీ రోడ్డులో మోకాలులోతు నీరు ప్రవహిస్తుండడంతో వాహనదారుల ఇబ్బందులు



అరుంధతినగర్ బస్తీలో నిలిచిన వరదనీరు



ఎన్‌టీఆర్ స్టేడియం వద్ద వరదనీరు సాఫీగా వెళ్లేలా చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది



మద్యం మత్తులో వరదనీటిలో ఈతకొడుతున్న ఓ వ్యక్తి



రాంనగర్‌లో భారీ వర్షం కురుస్తుండడంతో నిర్మానుష్యంగా మారిన రోడ్డు

డ్రైనేజీ సమస్య పరిష్కారానికి కృషి : ముఠా గోపాల్

రాంనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ మణెమ్మ గల్లీలో డ్రైనేజీ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేదుకు కృషి చేస్తానని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. మణెమ్మ గల్లీలో కొనసాగుతున్న డ్రైనేజీ నిర్మాణం పనులను గురువారం సాయంత్రం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మణెమ్మ గల్లీలో దీర్ఘకాలికంగా నెలకొన్న డ్రైనేజీ సమస్య పైప్‌లైన్ నిర్మాణంతో పరిష్కారం అవుతుందని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ముఠా జైసింహ, బల్ల శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్, మాధవ్, శ్యామ్‌సుందర్, చిట్టి, నేతా శ్రీనివాస్, ధర్మశంకర్ పాల్గొన్నారు.



మణెమ్మ గల్లీలో డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

సాయుధ రైతాంగ పోరాట వీరుడు దొడ్డి కొమురయ్య



దొడ్డి కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముఠా జైసింహ, శ్రీధర్‌రెడ్డి, అరుణ్ కుమార్, దీన్‌దయాల్ రెడ్డి తదితరులు

ముషీరాబాద్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): భూమి కోసం, భుక్తి కోసం, ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరుడు దొడ్డి కొమురయ్య అని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ కొనియాడు. గురువారం ముషీరాబాద్‌లో దొడ్డి కొమురయ్య జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా ముఠా జైసింహ హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్ కుమార్, అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు బల్లా శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రీనివాస్ యాదవ్, సాయి చాణిక్యరెడ్డి, సత్యనారాయణ బాబు పాల్గొన్నారు.

హజార్ గల్లీలో పర్యటన

ముషీరాబాద్ డివిజన్ హజార్ గల్లీ, సెయింట్‌పాయిస్ స్కూల్ వీధిలో గత నెల రోజులుగా తాగునీటి సరఫరా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జైసింహ పేర్కొన్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు గురువారం జలమండలి అధికారులతో కలిసి ముఠా జైసింహ హజార్ గల్లీలో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జలమండలి అధికారులు తాగునీటి పైప్‌లైన్ నిర్మాణ పనులు పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీధర్‌రెడ్డి, ఆకుల అరుణ్ కుమార్, నాయకులు దీన్‌దయాల్‌రెడ్డి, తలారి శ్రీకాంత్ ముదిరాజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలను అమలు చేయాలి

చిక్కడపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీలోని హాస్టల్‌లో, మెస్సులో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు జీవోను అమలు చేయాలని కోరుతూ ప్రోగ్రెసివ్ కాంట్రాక్ట్ అండ్ క్యాజువల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో జంటనగరాల కార్మిక సంయుక్త కమిషనర్ సునీతను గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ మాట్లాడుతూ 201 మంది కార్మికులకు 2009 సంవత్సరంలో యూనివర్సిటీ ఆరునెలల డిఫరెన్స్ అమౌంట్ రూ.26,17,800 చెల్లించాల్సి ఉందని అన్నారు. జంటనగరాల కార్మిక సంయుక్త కమిషనర్ ఇచ్చిన అవార్డుపై 50 శాతం డిపాజిట్ చేస్తూ యూనివర్సిటీ హైకోర్టుకు వెళ్ళిందన్నారు. హాస్టల్ ఉద్యోగులు కార్మికశాఖను ఆశ్రయించారన్నారు. ఫలితంగా మార్చి ఏడున డిపాజిట్ చేసిన 50 శాతం డబ్బులు తక్షణమే కేసు వేసిన ఉద్యోగులకు చెల్లించాలని జాయింట్ కమిషనర్ ఆఫ్ లేబర్‌ను హైకోర్టు ఆదేశించిందని, ఆ ఆదేశాలను అమలు చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చామన్నారు. కార్యక్రమంలో జయ, పద్మ, విజయ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



జంటనగరాల కార్మిక సంయుక్త కమిషనర్ సునీతకు వినతిపత్రం సమర్పిస్తున్న ఎస్ఎల్ పద్మ తదితరులు

వీఎస్టీ ఈసీసీఎస్ పాలకమండలి ఎన్నిక



పాలకమండలి సభ్యులకు నియామకపత్రం అందజేస్తున్న శివకుమార్

రాంనగర్, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): వీఎస్టీ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ కన్స్యూమర్ సొసైటీ(ఈసీసీఎస్) నూతన పాలక మండలిని గురువారం ఎన్నుకున్నారు. సొసైటీ చైర్మన్‌గా మహ్మద్ ఆబిద్‌షరీఫ్, ఉపాధ్యక్షులుగా శ్యామ్‌కుట్టి, ప్రధాన కార్యదర్శిగా టి.పాల్‌సింగ్, అసోసియేట్ కార్యదర్శిగా రాజశేఖర్‌రెడ్డి, కోశాధికారిగా ఎస్.గౌరీశంకర్, కమిటీ సభ్యులుగా అభిషేక్, అజయ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, రాహుల్, సత్యనారాయణ నియమితులయ్యారు. వీరికి రాష్ట్ర కోఆపరేటివ్ సొసైటీ ఎన్నికల అధికారి శివకుమార్ నియామక పత్రాలు అందజేశారు. వీరి పదవీకాలం ఐదు సంవత్సరాలు పాటు ఉంటుందని తెలిపారు.

గద్దర్‌పై జరిగిన కాల్పుల ఘటనపై సమగ్ర దర్యాప్తు జరగలేదు: దళిత సంఘాలు

కవాడిగూడ, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): 1997లో ప్రజాయుద్ధనౌక గద్దర్‌పై కాల్పులు జరిగినప్పటికీ ఇప్పటి వరకు ఆ ఘటనపై ప్రభుత్వాలు ఎలాంటి సమగ్ర దర్యాప్తు చేయలేదని, నిందితులను అరెస్టు చేయలేదని పలు దళిత సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. గద్దర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద పలు దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నేతలు జి.వినోద్‌కుమార్, కరణం కిషన్, యాదగిరి, బొట్టు శివ, గడం శ్రీనివాసులు మాట్లాడుతూ గద్దర్‌పై కాల్పులు జరిగి 28 సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ న్యాయం జరగలేదని ఆందోళన వ్యక్తం చేశారు. 2015-16 సంవత్సరంలో కేసును కొట్టివేయడం వేయడం దారుణం వారు అన్నారు.

హెచ్‌సీయూ విద్యార్థులపై నిర్బంధాన్ని ఆపండి

- బహుజన లెఫ్ట్ పార్టీ డిమాండ్

చిక్కడపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను వేలం వేయొద్దని ఆందోళన చేస్తున్న విద్యార్థులపై నిర్బంధాన్ని ఆపాలని బహుజన లెఫ్ట్‌ఫ్రంట్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిక్కడపల్లిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. హెచ్‌సీయూ భూములను వేలం వేయకుండా గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో వివిధ ప్రైవేట్ కార్పొరేట్ కంపెనీలకు కేటాయించిన భూముల్లో ఎలాంటి పరిశ్రమలు పెట్టకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న లక్షలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకుని అభివృద్ధి చేయాలని సూచించారు.

'కేజీహెచ్‌ను రిజర్వ్‌ఫారెస్ట్‌గా ప్రకటించాలి'

చిక్కడపల్లి, ఏప్రిల్ 3 (ఆంధ్రజ్యోతి): కంచగచ్చిబౌలి ఫారెస్ట్(కేజీహెచ్)ను రిజర్వ్ ఫారెస్ట్‌గా ప్రకటించాలని చేనేత సామాజిక ఉద్యమ నాయకుడు చిక్కా దేవదాసు సీఎంను కోరారు. గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జీవవైవిధ్యం, జలవనరులు పర్యావరణాన్ని రక్షించడం ప్రభుత్వ, పాలకుల బాధ్యతగా భావించి కంచగచ్చిబౌలి అడవిని రిజర్వ్‌ఫారెస్ట్‌గా ప్రకటించి భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన పేర్కొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



చిక్కడపల్లి, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ రాజునాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. నాయిని నర్సింహారెడ్డి స్టీల్‌బ్రిడ్జి 25, 26 పిల్లర్ వద్ద ఓ వ్యక్తి అచేతనంగా పడి ఉన్నట్లు గురువారం పోలీసులకు సమాచారం అందింది. వారు వెంటనే అక్కడికి చేరుకుని 108 సమాచారం ఇచ్చారు. వారు వచ్చి పరిశీలించి ఆ వ్యక్తి మరణించినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు సూచించారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి..

బర్కత్‌పుర ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైల్ ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. కాచిగూడ రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పుగూడ- యాకత్‌పుర రైల్వేస్టేషన్ మధ్య 50ఏళ్ల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతిచెంది రైలు పట్టాల పక్కనున్న గోతిలో పడిపోయాడు. గురువారం రాత్రి పట్టాలు చెకింగ్ చేస్తున్న కార్మికుడికి మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇంట్లో షార్ట్ సర్క్యూట్.. ఫ్రిడ్జ్, కూలర్ దగ్ధం



కాలిపోయిన ఫ్రిడ్జ్

బర్కత్‌పుర, ఏప్రిల్ 3(ఆంధ్రజ్యోతి): గోల్నాక కూరగాయల మార్కెట్ సమీపంలోని ఓ ఇంట్లో షార్ట్ సర్క్యూట్‌తో ఫ్రిడ్జ్‌లో మంటలు వచ్చాయి. మంటలు వ్యాపించడంతో ఇంట్లోని కూలర్‌తో పాటు విలువైన వస్తువులు కాలిపోయాయి. ఇద్దరు చిన్నారులు బయటకు వెళ్లిపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కాచిగూడ సీఐ జోష్నా, ఎస్సై నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాక కూరగాయల మార్కెట్‌లో ఎస్.హరిబాబు, భార్య మనీషా, ఇద్దరు పిల్లలతో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. గురువారం ఉదయం తల్లిదండ్రులు ఉద్యోగానికి వెళ్లిన సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో ఫ్రిడ్జ్‌లో మంటలు, దట్టమైన పొగలు వచ్చాయి. ఆ సమయంలో ఇంట్లో ఉన్న శ్రీరిక్విత(10), నిత్యశ్రీ(7) భయంతో బయటకు పరుగులు తీశారు. దట్టమైన పొగలు కమ్మి ఇంట్లోని విలువైన వస్తువులు కాలిపోయాయి. ఫైర్ ఇంజన్ వచ్చేలోపు స్థానికులు మంటలను ఆర్పివేశారు. ఇంటి యజమాని పోలీసులకు సమాచారం అందించాడు. కాచిగూడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు.